ప్రజాశక్తి
బుధవారం 24 ఏప్రిల్ 2024
I
అల్లూరి సీతారామరాజు

రోడ్డు పనులు ప్రారంభం
-ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి- అనంతగిరి:నిలిచిన రోడ్డు పనులు పున్న ప్రారంభించాలని, పనులు జరగకుండా నిధులు స్వాహాకు పాల్పడిన సంబంధిత కాంట్రాక్టర్, అధికారులపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు చేపట్టిన ఆందోళన వార్త మంగళవారం ప్రజాశక్తి దినపత్రికలో ప్రచురితమైంది. ఈ వార్తకు స్పందించిన అధికారులు పెద్దకొట్ట పంచాయతీ పరిధి చీడివలస, పాఠిపల్లి, బందకొండ గ్రామాల రింగ్ రోడ్డు పనులను మంగళవారం ప్రారంభించారు. అధికారులు సిబిఎస్ మెటల్ పనులు ప్రారంభించారు.

చేపడుతున్న రోడ్డు పనులు

రోగులతో ఆసుపత్రి కిటకిట

-స్కానింగ్ కోసం గర్భిణుల అవస్థలు
-గైనకాలజిస్టు రాక గంటల తరబడి నిరీక్షణ
-తాగునీటి కోసం రోగులు అవస్థలు

ప్రజాశక్తి-ముంచంగిపుట్టు : మండల కేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రం వివిధ వ్యాధులతో వచ్చిన రోగులతో కిటకిటలాడింది. వేసవి కాలం అత్యధికంగా ఎండ తీవ్రత ఉండటంతో పలు వ్యాధుల బారిన పడి ఆసుపత్రికి వైద్య సేవలు నిమిత్తం మంగళవారం గిరిజనులు వచ్చారు. గంటల తరబడి వరసలో నిలబడి వైద్య సేవల నిమిత్తం వేచి చూశారు. వార్డులో కనీసం నీటి సౌకర్యం లేక పోవడంతో ఇబ్బందులకు గురవుతున్నామని రోగులు తెలిపారు. గత రెండు వారాలుగా కాల కృత్యాలు తీర్చుకునే సమయానికి నీరు రాలేదని, రా ్రతి వేళల్లో నీరు వస్తున్నప్పటికీ చాలీచాలకుండా వస్తుందని రోగులు తెలిపారు. రోగులకు బెడ్ సీట్లు సైతం ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

సామాజిక ఆరోగ్య కేంద్రానికి మంగళవారం ఒపి 165 మంది రోగులు వచ్చారు. వీరిలో సీజనల్ వ్యాధులైన జలుబు, దగ్గు, జ్వరం, మలేరియా, టైఫాయిడ్ వంటి వ్యాధులతో బాధపడుతున్నారు.మండలంలోని నాలుగు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నుండి సుమారు 30 మంది గర్భిణీలు స్కానింగ్ నిమిత్తం వచ్చారు. గైనకాలజిస్టు మంగళవారం పాడేరు జిల్లా ఆసుపత్రి నుండి రాక పోవడంతో గర్భిణీలు నిరాశతో తిరిగి వెళ్లి పోయారు. స్కానింగ్ టెక్నీషియన్, గైనకాలజిని సామాజిక ఆరోగ్య కేంద్రంలో నియామకాలు చేపట్టాలని గర్భిణీలు ప్రభుత్వాన్ని కోరారు.

శిశు జనన నిరీక్షణ కేంద్రం (ఎస్ఎన్సియు)లో సైతం నీరు సౌకర్యం లేదని బాలింతలు ఆవేదన వ్యక్తం చేశారు. బాలింతలు ఆరు బయటకు వెళ్లి స్నానాలు చేయవలసిన దుస్థితి నెలకొంది.

ఆసుపత్రిలో వార్డులో ఉన్న రోగులు

గర్భిణీలకు తప్పని అవస్థలు

ఆంధ్ర ఒరిస్సా సరిహద్దు ప్రాంతమైన ముంచింగి పుట్టు సామాజిక ఆరోగ్య కేంద్రానికి ముంచింగి పుట్టు పెదబయలు, ఒడిస్సా రాష్ట్ర గర్భిణీలు స్కానింగ్ చేయించుకునేందుకు ఈ ఆసుపత్రికి వస్తుంటారు. మంగళవారం సుమారు 20 మంది గర్భిణీలు వచ్చారు. సమయం 12 గంటలు దాటినప్పటికీ గైనకాలజిస్ట్ రాలేదు. సమయం దాటిపోయినప్పటికీ రాకపోవడంతో గర్భిణీలు నిరాశతో గ్రామాలకు వెళ్లి పోయారు.

వేచివున్న గర్భిణులు, బాలింతలు

నామినేషన్ దాఖలు చేస్తున్న అరకు వైసిపి రెబల్ అభ్యర్థి వంతల రామన్న

జిల్లాలో 9 నామినేషన్లు దాఖలు

ప్రజాశక్తి-పాడేరు

అల్లూరి జిల్లాలో మంగళవారం 9 నామినేషన్లు దాఖలు అయ్యాయి. ఇందులో అరకులోయ అసెంబ్లీ స్థానానికి ఆరు నామినేషన్లు, పాడేరు అసెంబ్లీ స్థానానికి ఒక నామినేషన్, రంపచోడవరం అసెంబ్లీ స్థానానికి రెండు నామినేషన్లు చొప్పున దాఖలు అయ్యాయి. పాడేరు అసెంబ్లీ స్థానానికి వైయస్సార్సీపి అభ్యర్థి మత్స్యరాస విశ్వేశ్వరరాజు ఒక నామినేషన్, రంపచోడవరం అసెంబ్లీ స్థానానికి బీఎస్పీ అభ్యర్థి కాకూరు కన్నం రెడ్డి, ఇండిపెండెంట్ అభ్యర్థి కుంజా శ్రీను నామినేషన్లు నామినేషన్లు వేశారు. అరకు వ్యాలీ అసెంబ్లీ స్థానానికి స్వతంత్ర అభ్యర్థులు చెండా ఎలియా, సివేరి అబ్రహాం, వంతాల రామన్న, నరాజి మధుబాబు, మర్రి ఉషారాణి నామినేషన్లను సమర్పించారు. జై భారత్ నేషనల్ పార్టీ అభ్యర్థిగా బురిడి ఉపేంద్ర నామ పత్రాన్ని దాఖలు చేసారు.

వైసిపి రెబల్ అభ్యర్థి రామన్న నామినేషన్

అరకులోయ రూరల్ : అరకు నియోజకవర్గ వైసిపి రెబల్ అభ్యర్థి వంతల రామన్న నామినేషన్ దాఖలు చేశారు. మంగళవారం బాకూరు జంక్షన్ నుంచి చింతలవీధి వరకు కార్యకర్తలు, సర్పంచులు అభిమానులతో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం పాడేరు ఐటిడిఎ కార్యాలయంలో అరకు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి వి అభిషేక్‌కు తన నామినేషన్ పత్రాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీలు, సర్పంచులు పాల్గొన్నారు.

రంపచోడవరంలో రెండు నామినేషన్లు

రంపచోడవరం : రంపచోడవరం అసెంబ్లీ నియోజకవర్గానికి 5వ రోజు రెండు నామినేషన్లు దాఖలైనట్లు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి యస్.ప్రశాంత్ కుమార్ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక సబ్ కలెక్టర్ వారి కార్యాలయ సమావేశ మందిరంలో వై.రామవరం మండలం గుర్తేడు పంచాయితీ అల్లూరి గడ్డ గ్రామానికి చెందిన కాకూరు కన్నపురెడ్డి ఒక్క నామినేషన్ పత్రాన్ని, ఎటపాక మండలం చెన్నంపేట గ్రామానికి చెందిన కుంజ శీను ఒక్క నామినేషన్ పత్రాం సమర్పించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి ఎ.జ్యోతి కృష్ణ, డిప్యూటీ తాసిల్దారులు యన్. వివి సత్యనారాయణ,బి. రాజు,శివ,రామకష్ణ, చైతన్య, విశ్వనాథ్, సరిత, బాలాజీ, శ్రీధర్, రవీంద్రబాబు, వీరభద్ర రావు,ఎ.సత్యనారాయణ, సీనియర్ సహాయకులు లక్ష్మణరావు, పాలు బాబు అలెగ్జాండర్ తదితరులు పాల్గొన్నారు.

సెలవులతో విద్యార్థులు ఇంటిబాట

లగేజితో ఇంటికి వెళుతున్న విద్యార్థులు

ప్రజాశక్తి-పాడేరు టౌన్: వేసవి సెలవులు వచ్చాయంటే చిన్నారులకు పండగే.. పండగ. పాఠశాలకు వేసవి సెలవుల కావటంతో మంగళవారం వసతిగృహాల్లోని విద్యార్థులు ఇళ్లకు బయల్దేరారు. ఉదయాన్నే తల్లిదండ్రులు పిల్లలను తీసుకుని వెళ్లేందుకు చేరుకున్నారు. అల్లూరి జిల్లా కేంద్రం పాడేరులోని వసతి గహాలు, పాఠశాలల్లో సందడి వాతావరణం కనిపించింది.

రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలలకు బుధవారం నుంచి వేసవి సెలవులు ప్రకటించడంతో విద్యార్థులు ఉత్సాహంగా ఇళ్లకు పరుగులు తీశారు. పాడేరులో ఎక్కడ చూసినా ఒక్కటే సందడి. ట్రంకు పెట్టెలు నెత్తిన పెట్టుకుని పిల్లలతో తల్లిదండ్రుల హడావిడి. ఆటో స్టాండ్లు.. ఆర్టిసి కాంప్లెక్స్..బస్సు స్టాప్.. ఇలా అన్నిచోట్లా గుంపులుగా జన సవ్వడి. ఆశ్రమ పాఠశాలలకు బుధవారం నుంచి వేసవి సెలవులు ప్రకటించడంతో విద్యార్థులు మూకుమ్మడిగా తమ లగేజీలతో ఇంటి బాట పట్టడంతో జాతరవాతావరణం తారస పడింది. మన్యంలోని పనులు గ్రామాల నుంచి తల్లిదండ్రులు ఉదయం 10 గంటలకు పాఠశాలలకు చేరుకుని తమ పిల్లలను ఇళ్లకు తీసుకు వెళ్లడానికి సిద్ధమయ్యారు. దీంతో పలు కూడళ్ల రద్దీగా మారాయి. జీపులు, బస్సులు వెళ్లని గ్రామాలకు తమ పిల్లలను కొందరు ద్విచక్ర వాహనాలపై తీసుకు వెళ్లారు. ఆర్ టిసి బస్ కాంప్లెక్స్ విద్యార్థులు, తల్లిదండ్రులతో కిటకిటలాడింది. ఇళ్లకు వెళుతున్నామన్న ఆనందం విద్యార్థుల్లో కనిపించింది.

బైక్‌పై వెళుతున్న విద్యార్థి

ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థుల తల్లిదండ్రులను సత్కరిస్తున్న దృశ్యం

విద్యార్థుల తల్లిదండ్రులకు సత్కారం

ప్రజాశక్తి - చింతూరు

చింతూరులోని జిల్లా పరిషత్ హైస్కూల్లో పదో తరగతి పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థుల తల్లిదండ్రులను హైస్కూల్ ఉపాధ్యాయులు మంగళవారం సన్మానించారు. 570 మార్కులు సాధించి డివిజన్ టాపర్‌గా నిలిచిన వేలు వసుంధర, 554 మార్కులతో పాఠశాల స్థాయిలో ద్వితీయ స్థానం సాధించిన పండా ఆదిలక్ష్మి ప్రియ, 520 మార్కులతో తృతీయ స్థానం సాధించిన గోదే హర్షిత, 507 మార్కులతో నాలుగో స్థానంలో నిలిచిన మధుప్రియ తల్లిదండ్రులను హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు కె.బాలకష్ణ సన్మానించారు, ఈ కార్యక్రమంలో టీచర్లు నాగరాజు, భద్రయ్య , సుజాత, రత్తయ్య,పెంటమ్మ, సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

వెలిగిన వీధి దీపాలు
-ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: ఈనెల 23న ప్రజాశక్తిలో అంధకారంలో డుంబ్రిగుడ, వెలుగని వీధి దీపాలు అనే వార్త ప్రచురితమైంది. ఈ వార్తకు స్పందించిన స్థానిక పోతంగి పంచాయతీ అధికారులు మండల కేంద్రంలోని డుంబ్రిగుడ పురవీధుల్లో మరమ్మతుకు గురైన వీధిదీపాలను పునరుద్ధరించి వెలిగించారు. వీధి దీపాలు లేక గత రెండు నెలలుగా అంధకారంలో ఉండటంతో ఇబ్బంది పడిన మండల కేంద్రం వాసులు వీధి దీపాలు పునరుద్ధరించడంతో ఆనందం వ్యక్తం చేశారు.

వెలుగుతున్న వీధి దీపాలు

మహిళ మృతదేహం లభ్యం
ఆలస్యంగా వెలుగులోకి..

ప్రజాశక్తి - చింతపల్లి:అడ్డపిక్కల కోసం అడవికి వెళ్లి గడచిన ఐదు రోజులుగా ఇంటికి చేరని వృద్ధురాలు వంజరి రాజులమ్మ మృతదేహమై కనిపించింది. ఆలస్యంగా అందిన సమాచారం మేరకు.. జీకే వీధి మండలం వనబలింగి గ్రామానికి చెందిన వంజరి రాజులమ్మ ఐదు రోజుల క్రితం అడ్డపిక్కల నిమిత్తం ఇంటి నుండి బయలు దేరి అడవికి వెళ్ళింది. ఆనాటి నుండి ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆమె కోసం గాలించారు. ఈ నేపథ్యంలో సోమవారం చెరపల్లి అటవీ ప్రాంతంలో ఆమె మృతదేహం లభ్యమైంది. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

పూజలు చేస్తున్న గిరిజనులు

గ్రామాల్లో పండగ సందడి

ప్రజాశక్తి-ముంచంగిపుట్టు:మండలంలో పలు గ్రామ పంచాయతీ గ్రామాల్లో ఇటుకల పండుగ సందడి నెలకొంది. . ఏనుగురాయి పంచాయతీ వల్ల చోటా ముక్కుపుట్టు గ్రామంలో గిరిజన సాంప్రదాయబద్ధంగా మామిడి కొమ్మల పందిళ్లు వేశారు. ఈ ఏడాది కాలమంతా ఆరోగ్యాలతో, సిరి సంపదలు కలిగి, వ్యవసాయ పంటల అధిక దిగుబడులు రావాలని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం విత్తనాల జాతరలో భాగంగా పలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ పండుగ సందర్భంగా పలు చోట్ల చందాలు వసూలు చేస్తారు. వాహనదారులకు రంగులు పూసి చందాలు ఇవ్వాలని కోరుతారు. వాహనదారులను కర్రలతో ఏర్పాటు చేసిన చెక్ పోస్టుల వద్ద అడ్డగిస్తారు.

లెక్క మారింది..

సిపిఎం నామినేషన్ కార్యక్రమానికి వేలాదిగా జనం రాకతో టిడిపి, వైసిపి నేతల్లో గుబులు

ప్రజాశక్తి-రంపచోడవరం

నిన్నటి వరకు ఒక లెక్క.. నేటి నుంచి మరో లెక్క అన్నట్టుగా మారింది రంపచోడవరం నియోజకవర్గంలోని రాజకీయ పరిస్థితులు. ఇండియా వేదిక బలపర్చిన సిపిఎం రంపచోడవరం ఎమ్మెల్యే అభ్యర్థిగా సోమవారం లోత రామారావు నామినేషన్ వేయడంతో రంపచోడవరంలో రాజకీయాలు ఒక్కసారి వేడెక్కాయి. నిన్నటి వరకు అసెంబ్లీ నియోజకవర్గం ఎన్నికల్లో ప్రధాన పోటీ టిడిపి, వైసిపిల మధ్య ఉంటుందని భావించిన ఆ పార్టీల నేతలు సోమవారం సిపిఎం నామినేషన్ కార్యక్రమానికి వేలాదిగా తరలివచ్చిన ప్రజలను చూసి ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. టిడిపి టికెట్ కేటాయింపు వ్యవహారంతో ఆ పార్టీలో అసమ్మతి సెగ కారణంగా వైసిపి నేతలు తమ గెలుపు ఖాయమని భావించారు. కాని సిపిఎం ర్యాలీ, బహిరంగ సభను చూసిన తర్వాత ఆ పార్టీలు డైలమాలో పడ్డాయి.

టిడిపి, వైసిపి ర్యాలీలకు, సమావేశాలకు జన సమీకరణకు, వారిని తరలించేందుకు ఎన్నో వ్యయ ప్రయాసలు పడుతుంటే... వచ్చిన వారికి కనీసం భోజనం కూడా పెట్టకపోయినా సిపిఎంపై ఉన్న అభిమానంతో వేల సంఖ్యలో నామినేషన్ కార్యక్రమానికి తరలివచ్చారు. కొన్ని ప్రాంతాలలో సిపిఎం ర్యాలీకి వెళ్లకుండా అడ్డుకునేందుకు ప్రయత్నించిన వాటిని లెక్కచేయకుండా తరలివచ్చిన జనాన్ని చూసి ఇరు పార్టీలకు చెందిన నేతలు నివ్వెరపోతున్నారు. సోమవారం వేల సంఖ్యలో తరలివచ్చిన సిపిఎం అభిమానులతో రంపచోడవరం రోడ్లన్నీ ఎరుపెక్కి ఎర్ర సముద్రంలో మారాయి. నిన్నటి వరకు సిపిఎంపై ఎటువంటి అంచనాలు వేయకుండా ప్రధానంగా టిడిపి, వైసిపిల మధ్యనే పోటీ నడుస్తుందని భావించగా, ఒక్కసారిగా వారి అంచనాలు తారుమారు చేస్తూ నేడు పోటీ వైసిపి, సిపిఎం మధ్యనేనని ప్రజలు, రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. దీంతో టీడీపీలోని అసమ్మతి నేతలను బుజ్జగించేందుకు ఆ పార్టీ ముఖ్య నేతలు పడరాని పాట్లు పడుతున్నారు. అసమ్మతి నేతలతో సమావేశాలు నిర్వహించి అభ్యర్థికి మద్దతుగా ప్రచారం చేయాలని మంత్రాంగాలు చేస్తున్నారు. మరోపక్క వైసీపీ నేతలు సైతం సీపీఎం అభ్యర్థిని ఓడించేందుకు వ్యూహాలు పన్నుతున్నారు. ఇదిలా ఉంటే ప్రజలు మాత్రం టిడిపి, వైసిపి రెండు పార్టీల పాలన చూశామని, ఒక్కసారి సిపిఎం అభ్యర్థిని గెలిపించి అసెంబ్లీకి పంపించాలని ఆలోచిస్తున్నట్లుగా పలువురు రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

సోమవారం సిపిఎం అభ్యర్థి రామారావు నామినేషన్ సందర్భంగా నిర్వహిస్తున్న భారీ ప్రదర్శన

నిత్యం ప్రజల కోసం పోరాటం, ప్రజల మధ్యలో ఉండే సిపిఎం అభ్యర్థిని గెలిపించుకుంటే జీవో నెంబర్ 3 పునరుద్ధరణ, 1/70 చట్టం పటిష్టంగా అమలు, పోలవరం నిర్వాసితులకు న్యాయం జరుగుతుందని ఆదివాసీలు భావిస్తున్నారు. ఒక్క సిపిఎం నాయకుల వల్లే ఏజెన్సీ అభివృద్ధి సాధ్యమవుతుందని ఈ ప్రాంతంలోని విద్యావంతులు, నిరుద్యోగులు, మేధావులు విశ్వసిస్తున్నారు. రంపచోడవరం నియోజకవర్గంలో సిపిఎం అభ్యర్థిని గెలిపించమని ప్రచారానికి వెళ్లిన ఆ పార్టీ నాయకులకు గ్రామాల్లోని ప్రజలు బ్రమ్మరథం పడుతూ ఈసారి తప్పకుండా సిపిఎం అభ్యర్థిని గెలిపించి సమస్యలను గురించి అడిగే ఒక గొంతును అసెంబ్లీకి పంపిస్తామని హామీ ఇస్తున్నారు.

వంతల రాజేశ్వరికి బుజ్జగింపులు

వంతల రాజేశ్వరిని కలిసిన టిడిపి నేతలు

ప్రజాశక్తి-రంపచోడవరం

రంపచోడవరం నియోజకవర్గం టిడిపి అభ్యర్థిగా మిరియాల శిరీషాదేవిని ప్రకటించడంతో తీవ్ర అసమ్మతి వ్యక్తం చేసిన మాజీ ఎమ్మెల్యే వంతల రాజేశ్వరిని ఎట్టకేలకు టిడిపి నేతలు బుజ్జగించారు. పలుమార్లు పార్టీ అధినేత చంద్రబాబును కలిసి సీటును తన కేటాయించాలని చేసిన ప్రయత్నాలు కూడా ఫలించకపోవడంతో ఏప్రిల్ 20వ తేదీన తాను టిడిపి రెబల్ అభ్యర్థిగా పోటీ చేయనున్నట్టు ప్రకటించారు. దీంతో స్పందించిన అధిష్టాన పెద్దలు పార్టీలోని ముఖ్య నేతలను రాజేశ్వరి వద్దకు పంపించి ఆమెను బుజ్జగించే ప్రయత్నం చేశారు ఎట్టకేలకు వాళ్ళ ప్రయత్నం ఫలించింది. మంగళవారం ఆమెతో జరిపిన చర్చలు సఫలం కావడంతో ఎన్నికల్లో రెబల్ అభ్యర్థిగా పోటీని ఉపసంహరించుకుని అధిష్టానం ప్రకటించిన ఎమ్మెల్యే అభ్యర్థి మిరియాల శిరీషను గెలిపించేందుకు తన వంతు సహాయ సహకారాలు అందించడానికి అంగీకరించినట్లు సమాచారం. దీనిపై అధికారికంగా ప్రకటన వెలువడాల్సి ఉంది.

గురుకుల కళాశాలల్లో ప్రవేశానికి దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి-రంపచోడవరం

రంపచోడవరం, చింతూరు ఐటీడీఏల పరిధిలోని ఎపి గిరిజన సంక్షేమ గురుకుల జూనియర్ కళాశాలల్లో 2024-25 విద్యా సంవత్సరంలో ఎంపిసి, బైపిసి, సిఇసి, హెచ్ఇసి, ఒకేషనల్ (ఎ అండ్ టి, సిజిఎ) కోర్సుల్లో ప్రవేశాలకు ఈ దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు రంపచోడవరం ఐటిడిఎ పిఒ సూరజ్ గనోరే తెలిపారు. మొత్తం 1030 సీట్ల భర్తీకి ఆన్ లైన్ ద్వారా దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు వెల్లడించారు. అప్లికేషన్లు www.aptwgurukulam.ap.gov.in వెబ్ సైట్ ద్వారా ఈ నెల 24నుండి మే నెల 15వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు పేర్కొన్నారు. పదవ తరగతిలో ఉత్తీర్ణత పొందిన గిరిజన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాల కోసం కన్వీనర్, రంపచోడవరం ఎపిటిడబ్ల్యూఆర్ జూనియర్ కళాశాల (బాలికలు) ప్రిన్సిపాల్ వారిని సంప్రదించాలని కోరారు.

పాపారావు మృతి టిడిపికి తీరని లోటు

ప్రజాశక్తి -సీలేరు

దారాలమ్మ ఆలయ కమిటీ మాజీ చైర్మన్, టిడిపి సీనియర్ నాయకులు మాడుగుల పాపారావు అకాల మృతి టిడిపి పార్టీకి తీరని లోటని జీసీసీ మాజీ చైర్మన్ ఎంవివి.ప్రసాద్, టిడిపి ఎస్టీ సెల్ రాష్ట్ర కార్యనిర్వాహన కార్యదర్శి కొర్ర బలరాం తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. జీకే వీధి మండలం దారకొండలోని పాపారావు కుటుంబ సభ్యులను మంగళవారం వారు పరామర్శించి మనోధైర్యం కల్పించారు. పాపారావు మృతదేహంపై పార్టీ జెండా పుష్పమాలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం ప్రసాద్ మాట్లాడుతూ టిడిపి ఆవిర్భావం నుంచి మాడుగుల పాపారావు నిబద్ధత పనిచేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు బోర్ర నాగరాజు, మండల అధ్యక్షులు ముక్కల రమేష్, ముక్కల మహేష్, యమన, శ్రీను, బుజ్జి బాబు, ముక్కల. కళ్యాణి అనంతగిరి జడ్పిటిసి దీసరి గంగరాజు, జీకే వీధి మాజీ జడ్పిటిసి నళిని, పాడేరు పంచాయతీ సర్పంచ్ కె .సుబ్బారావు. దారకొండ గ్రామస్తులు అంతిమ సంస్కారాల్లో పాల్గొన్నారు.

పాపారావు మృతదేహంపై పూలమాలలు ఉంచి నివాళు లర్పిస్తున్న టిడిపి నేతలు, బంధువులు

సిపిఎం అభ్యర్థులను గెలిపించాలని ప్రచారం

ప్రజాశక్తి-యంత్రాంగం

దుంబ్రిగుడ: అరకు పార్లమెంట్ సిపిఎం ఎంపీ అభ్యర్థి పి.అప్పలనర్సకు ఓటు వేసి గెలిపించాలని కోరుతూ మండలంలోని పోతంగి పంచాయతీ పెదపాడు గ్రామంలో ఆ పార్టీ నాయకులు మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి ఎస్‌బి పోతురాజు మాట్లాడుతూ, గిరిజన ప్రాంత పరిరక్షణకు పాటుపడే సిపిఎం ఎంపీ అభ్యర్థి అప్పలనర్సకు ఓటు వేసి గెలిపించాలని కోరారు.చాపరాయి గడ్డ వద్ద వంతెన నిర్మించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు కె.భాస్కరరావు, కె.దివ్య, పి.ఇంద్ర, గ్రామస్తులు సుబ్బారావు, నాయుడు, తౌడన్న తదితరులు పాల్గొన్నారు.

అరకులోయ రూరల్:ఇండియా కూటమి బలపరిచిన అరకు సిపిఎం పార్లమెంట్ అభ్యర్థి పాచిపెంట అప్పలనర్సను గెలిపించాలని మండలంలోని బొండం పంచాయతి కొత్తవలన, శిరగాం పంచాయతి నడిమివలస, సిరగాం, సందివలసలో సిపిఎం నాయకులు ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి రామారావు, ఆదివాసి గిరిజన సంఘం మండల అధ్యక్షుడు బుజ్జిబాబు కే బుజ్జిబాబు, జోషి మాట్లాడుతూ, వైసీపీ, టిడిపి, జనసేన కు ఓటు వేస్తే మతోన్మాద బిజెపికి ఓటు వేసినట్టేనని చెప్పారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు సత్యారావు, నాగేష్, కూర్మనరావు, బలరాం, వెంకట్, రమణ, రామస్వామి పాల్గొన్నారు.

అనంతగిరి:మండలంలోని నిమఉూట, మిర్తి దుంగడ, గ్రామాల్లో సిపిఎం నేతలు ప్రచారం చేపట్టారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి ఎస్, నాగులు, టోకూరు సర్పంచ్ కె.మొస్య, పూర్ణానంద పాల్గొన్నారు

చింతపల్లి:ప్రజా సమస్యలపై తెగించి పోరాడే సిపిఎం పార్టీ అభ్యర్థుల గెలుపుతోనే మన్య ప్రాంతంకు మంచి రోజులు వస్తాయని ఆ పార్టీ చింతపల్లి మండల ప్రధాన కార్యదర్శి పాంగి ధనుంజయ్ అన్నారు. మండలంలోని కొత్తపాలెం, బెన్నవరం పంచాయతీలలోని డేగలపాలెం, పిన్నపాడు గ్రామాల్లో అప్పలనర్స ను గెలిపించాలని మండల కమిటీ సభ్యుడు సీదరి సత్తిబాబు ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ధనుంజయ్ మాట్లాడుతూ, నిత్యం ప్రజలతో మేకమై సమస్యలపై పోరాడుతున్న సిపిఎం పార్టీ అభ్యర్థులు గెలిస్తేనే మన్య ప్రాంతంలో సమస్యలు పరిష్కారం కాగలవని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు సీదరి సత్తిబాబు, మహిళా సంఘం జిల్లా నాయకులు పాంగి కుమారి, చిన్నమ్మి, శ్రీను, వెంకట్రావు, చిట్టిబాబు పాల్గొన్నారు.

దేవీపట్నం మండలం ఇందుకూరుపేటలో ప్రచారం నిర్వహిస్తున్న సిపిఎం కార్యకర్తలు

అరకులోయ మండలంలో ప్రచారం చేస్తున్న సిపిఎం నాయకులు

దేవీపట్నం : ఇండియా వేదిక బలపర్చిన సిపిఎం రంపచోడవరం ఎమ్మెల్యే అభ్యర్థి లోతా రామారావు, అరకు పార్లమెంట్ సిపిఎం అభ్యర్థి పి.అప్పలనర్సలను గెలిపించాలని కోరుతూ దేవీపట్నం మండలం ఇందుకూరుపేటలో సిపిఎం నాయకులు ఇంటింటా ప్రచారం చేశారు. రాష్ట్రంలో మే 13వ తేదీన జరుగుతున్న ఎన్నికల్లో సుత్తి కొడవలి నక్షత్రం గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని సిపిఎం నాయకులు విజ్ఞప్తి చేశారు. ఇంటింటి ప్రచారంలో సిపిఎం నాయకులు గూడెల్లి వెంకటరావు మాట్లాడుతూ ప్రజల సమస్యలపై ఉద్యమాలతో ప్రజల మధ్యనే ఉంటూ కార్మిక, కర్షక, ఉద్యోగుల హక్కుల రక్షణ కోసం పోరాడుతున్న సిపిఎం అభ్యర్థులను అఖండ మెజారిటీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. పోలవరం నిర్వాసితుల సమస్యలపై గల్లీ నుండి ఢిల్లీ దాకా పోరాడిన చరిత్ర సిపిఎం అభ్యర్థులకు మాత్రమే ఉందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఏ శ్యామల రాణి, కె విజయలక్ష్మి, జె గోపి, వి సాయిబాబు, బుల్లెమ్మ, ఎస్ సాయికృష్ణ పాల్గొన్నారు.

సీలేరు : రాజ్యాంగ పరిరక్షణ, గిరిజన హక్కులు చట్టాలు రక్షణ కోసం పోరాడే సిపిఎం అరకు పార్లమెంట్ అభ్యర్థి అప్పల నర్సకు ఓటు వేసి గెలిపించాలని గాలికొండ ఎంపీటీసీ అంపరంగి బుజ్జిబాబు కోరారు. జీకే వీధి మండలం ఏ దారకొండ పంచాయతీ గొల్లపల్లి, పెబ్బేంపల్లి, తడకపల్లి గ్రామాల్లో మంగళవారం ప్రచారం నిర్వహించారు. కేంద్ర బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై క్లుప్తంగా వివరించారు. కార్యక్రమంలో ఏ దారకొండ పంచాయతీ ఉపసర్పంచ్ మురళ చంటిబాబు, మురళ రామారావు, చిట్టిబాబు, పెద్దబాబు, చిన్నబ్బాయి తదితరులు పాల్గొన్నారు.

సజావుగా ఎన్నికలు నిర్వహించాలి

కలక్టర్ విజయ సునీత

ప్రజాశక్తి-పాడేరు: సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా, సజావుగా నిర్వహించడమే లక్ష్యంగా ఎన్నికల అధికారులు విధులు నిర్వర్తించాలని జిల్లా కలక్టర్ ఎం. విజయ సునీత ఆదేశించారు. సోమవారం రాత్రి కలక్టరేట్ నుండి వీడియో కాన్ఫరెన్సు ద్వారా వివిధ విభాగాల ఎన్నికల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, పిడబ్ల్యూడి ఓటర్లకు పోలింగ్ బూత్‌లలో అవసరమైన సదుపాయాలు కల్పించాలన్నారు. పోస్టల్ బ్యాలట్లకు సంబంధించి 12, 12డి ద్వారా దరఖాస్తు చేసుకున్న వారికీ పోస్టల్ బ్యాలెట్లను అందించాలన్నారు. ఇందులో 13 ఏ, బి సి డి లపై అవగాహన కల్పించి పోస్టల్ బ్యాలట్ సక్రమంగా వినియోగించుకొనేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. 25వ తేది వరకు నామినేషన్ల ప్రక్రియ కొనసాగుతుందని, 29న నామినేషన్ల ఉపసంహరణ అనంతరం పోలింగ్‌నకు అందరు సంసిద్ధులు కావాలని ఆదేశించారు. ఇవిఎంల రెండవ రేండమైజేషణ్ పూర్తి చేసి సంబంధిత పోలింగ్ కేంద్రాలకు తరలించడానికి సిద్ధం చేయాలని, పోలింగ్ సిబ్బందికి రెండవ విడత శిక్షణ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పోలింగ్ నిర్వహణలో సంబంధిత ప్రిసైడింగ్ అధికారి పూర్తి బాధ్యత వహించాలని ఆదేశించారు. పోలింగ్ రోజుకు ముందుగానే ఓటరు స్లిప్పులను పంపిణీ చేయాలని సూచించారు. పోలింగ్ జిల్లాలో మూడు నియోజక వర్గాలలో ఉదయం 7 గంటల నుండి సాయంత్రం 4 గంటలు వరకు మాత్రమె ఉంటుందన్న విషయం గుర్తించాలని సూచించారు. ఆ సమయానికి లైనులో ఉన్నవారికి స్లిప్పులు అందించి వారందరి ఓటింగు పూర్తయ్యేవరకు వేచి ఉండాలని తెలిపారు. పోలింగ్ పూర్తయిన తర్వాత స్ట్రాంగ్ రూమ్ లకు ఇవిఎంలను భద్రంగా తరలించాలని ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో డిఆర్ఒ బి.పద్మావతి, పోస్టల్ బ్యాలట్ నోడల్ అధికారి నంద్, ప్రత్యేక ఉప కలక్టర్లు పి. అంబేద్కర్, వీవీఎస్ శర్మ, తహసిల్దార్లు, సెక్టార్ ఆఫీసర్లు, ఎంపిడిఓలు, బూత్ లెవెల్ ఆఫీసర్స్, విఆర్ఒలు తదితరులు పాల్గొన్నారు.

ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి-పెదబయలు : గురుకుల కళాశాలలో ప్రవేశానికి ఆన్లైన్‌లో దరఖాసులు చేసుకోవాలని గురుకుల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ బి ఈశ్వరమ్మ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2024 విద్యా సంవత్సరంలో ఉత్తీర్ణులైన విద్యార్థులు మొదటి సంవత్సరం ప్రవేశానికి గిరిజన, గిరిజనేతర విద్యార్థుల నుండి ఆన్‌లైన్: www. aptwgurukulam.ap.gov.in లో ఈనెల 25 సాయంత్రం 5 గంటల లోపు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ తెలిపారు.

అడవి పంది దాడి

- ముగ్గురికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి -అనంతగిరి:మండలంలోని కొత్తూరు పంచా యతీ పరిధి శివలింగపురం, తీగలమెడ సమీపంలో ఫారెస్ట్ టేకు తోట కాపలాగా ఉంటున్న ఫారెస్ట్ ప్రోటక్ట్ సిబ్బందిపై మంగళవారం సాయంత్రం అడవి పంది దాడికి పాల్పడటంతో ముగ్గురుకు గాయాలు అయ్యాయి. వీరిలో బి,సురేష్ అంటిపర్తి, దేముడుకు స్వల్ప గాయాలు కాగా దుడ్డు వెంకటరావు కు తీవ్ర గాయాలయ్యాయి. వీరిని ప్రధమ చికిత్స నిమిత్తం ఎస్.కోట ప్రభుత్వాసుపత్రికి తరలించారు.వెంకటరావుకు తీవ్ర గాయాలు కావడంతో విజయనగరం గోశాల ఆసుపత్రికి తరలించారు

పఠనాసక్తిని పెంపొందించాలి

ప్రజాశక్తి-విశాఖపట్నం : పుస్తక పఠనాసక్తిని నేటి తరం యువతలో పెంపొందించాలని ఏయూ డాక్టర్ విఎస్.కృష్ణా గ్రంథాలయం గౌరవ గ్రంథాలయాధికారి ఆచార్య పి.వెంకటేశ్వర్లు అన్నారు. ప్రపంచ పుస్తక దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏయూ గ్రంథాలయంలో ఎస్ఆర్.రంగనాథన్, రవీంద్రనాథ్‌ఠాగూర్ విగ్రహాలకు పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా ఆచార్య వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, పుస్తకం నుంచి లభించే జ్ఞానం వ్యక్తి వికాసానికి దోహదపడుతుందన్నారు. దీని ఆవశ్యకతను గుర్తించి, విద్యార్థులకు వివరించాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నామినేషన్‌ను జయప్రదం చేయండి : ముత్తంశెట్టి

ప్రజాశక్తి -భీమునిపట్నం : భీమిలిలో బుధవారం వేసే తన నామినేషన్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని వైసిపి భీమిలి ఎమ్మెల్యే అభ్యర్థి ముత్తంశెట్టి శ్రీనివాసరావు వైసిపి నాయకులకు, కార్యకర్తలకు, అభిమానులకు పిలుపునిచ్చారు.

టెన్త్ ఫలితాల్లో సత్తా

చింతపల్లి : టెన్త్ ఫలితాల్లో సెయింట్ ఆన్స్ పాఠశాల విద్యార్థి యశ్వంత్ నాయుడు 558 మార్కులు, అన్విత 557 మార్కులు సాధించారనిమండల విద్యాశాఖ అధికారి పనసల ప్రసాద్ అన్నారు. అన్విత తండ్రి విజయరాజు కోర్టు ఉద్యోగి కాగా, తల్లి స్వరూప ఉపాధ్యాయురాలిగా ఉన్నారు. వీరిని ఉపాధ్యాయులు అభినందించారు.

అనంతగిరి:పదవ తరగతి పరీక్షల ఫలితాలలో గుమ్మ కోట గురుకుల పాఠశాల విద్యార్థులు సత్తా చాటారు. మండలంలోని 670 మంది బాల బాలికలు పరీక్షలు రాయగ ఇందులో 615 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. గుమ్మకోట గురుకులం (జీనబాడు) బాలికల పాఠశాల. శివలింగపురం బాలుర పాఠశాల వందకి వంద శాతం ఉత్తీర్ణత సాధించారు. గుమ్మకోట గురుకులం పాఠశాలలో విద్యార్థులు గొలజన భార్గవ్ 563 మార్కులు సాధించారు.అదే పాఠశాలకు చెందిన ఎం.దిల్ రాజు 554, లాల్జిత్ 544 మార్కులు సాధించారని విద్యాశాఖ అధికారి వెంకటరమణ తెలిపారు.

పెదబయలు: సీతగుంట పంచాయతీ పెదబయలు సెంటాన్స్ పాఠశాల విద్యార్థిని సత్యబాను ప్రియా 567, గురుకుల పాఠశాల (బాలుర) విద్యార్థి విజయ్ కుమార్ 559, బొండపల్లి ప్రభుత్వ ఆశ్రమ పాఠశాల విద్యార్థి వండలేబు రవికుమార్ 508 మార్కులు సాధించారని మండల విద్యాశాఖధికారులు కొమ్ము కృష్ణమూర్తి, గుమ్మా డేవిడ్ పుష్ప తెలిపారు.

భార్గవ్ (563)

అన్విత (557)

యశ్వంత్‌నాయుడు (558)

కోలాహలంగా పోలమాంబ పండగ

పోలామాంబ దర్శనానికి బారులదీరిన భక్తులు

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : పెదవాల్తేరు గ్రామదేవత కరకచెట్టు పోలమాంబ వార్షిక పండుగ మంగళవారం భక్తుల కోలాహలం మధ్య ఘనంగా జరిగింది. పెదవాల్తేరు, పరిసర 14 గ్రామాల నుంచి పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారి దర్శనం చేసుకున్నారు. దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్,ఉత్సవ అధికారి కె.శిరీష, ఆలయ ఇఒ గాయత్రి, ఏర్పాట్లను పర్యవేక్షించారు. భక్తులకు చలువ పందిళ్లు, తాగునీరు, పిల్లలు, వృద్ధులు, వికలాంగులకు ఆలయ పాలకమండలి ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. చినవాల్తేరు పట్టా ఫౌండేషన్ ఆధ్వర్యంలో భక్తులకు మజ్జిగ పంపిణీ చేసారు. 22న సోమవారం తోలేళ్ళ ఉత్సవం ఘనంగా నిర్వహించారు. ఈనెల 30న మంగళవారం మారువారం, వచ్చేనెల 4న శనివారం అన్నదానం నిర్వహిస్తామన్నారు. దేవస్థానం ఇఒ కె..గాయత్రి పర్యవేక్షణలో దేవస్థానం అర్చకులు అప్పలాచారి, చక్రవర్తి ఆచార్యులు, సుదర్శన శ్రీనివాస్, సిబ్బంది అప్పలరెడ్డి, నరేంద్ర ఏర్పాట్లు చేసారు.ఉత్సవ ఖర్చులకు పెదవాల్తేరు గ్రామ సేవా సంఘానికి రూ.8.5 లక్షలు ఇచ్చామని ఇఒ గాయత్రి తెలిపారు. కార్యక్రమంలో ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు పట్టా రమేష్‌బాబు, వ్యవస్థాపక సభ్యులు బొడ్డేడ వెంకటలక్ష్మి, దొడ్డి రమేష్, పీతల తాతారావు నాయుడు, పెంటకోట నూకరాజు, శ్రీదేవి, శ్రీలక్ష్మి, అఖిల పాల్గొన్నారు.

'నీ ఓటు.. నీ భవిష్యత్'పై అవగాహన



సదస్సులో అభిప్రాయం వ్యక్తం చేస్తున్న విద్యార్థిని

ప్రజాశక్తి- విశాఖపట్నం : కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ అధీనంలోని సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ (సిబిసి) ఆధ్వర్యంలో మంగళవారం ప్రభుత్వ విశాఖ మహిళా డిగ్రీ కాలేజీలో ఓటర్ల అవగాహన సదస్సుకు విశేష స్పందన లభించింది. కేంద్ర ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో వ్యవస్థీకృత ఓటర్ల విద్య, ఓటర్ల భాగస్వామ్యం కార్యక్రమం (స్వీప్) ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో, సిబిసి రాష్ట్ర అధనపు డైరెక్టర్ జనరల్ రాజేంద్ర్ చౌదరి మాట్లాడుతూ ప్రపంచంలోనే అతి పెద్ద ప్రజాస్వామ్యదేశమైన భారత్‌లో ఎన్నికల ప్రక్రియలో అందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కేంద్ర ఎన్నికల సంఘం అర్హులైన వారందరినీ ఓటర్లుగా నమోదుకు పెద్దఎత్తున కార్యక్రమాలను నిర్వహిస్తోందని, ఓటు హక్కు పొందినవారంతా దాన్ని వినియోగించుకోవాలన్నారు.. ఓటింగ్ శాతం పెరగడానికి యువత ముందుకు రావాలన్నారు.

స్వీప్ జిల్లా నోడల్ అధికారి, సాంఘిక సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ కె.రామారావు మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా ఓటర్ల అవగాహనకు వివిధ బృందాలతో ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. సిబిసి సహాయ సంచాలకుడు షఫి మహమ్మద్ మాట్లాడుతూ ఓటింగ్ శాతం పెరగడానికి యువత కృషి చేయాలని, పటిష్ఠమైన ప్రజాస్వామ్య ప్రభుత్వాన్ని ఎన్నుకోవాలని పిలుపునిచ్చారు. కాలేజీ వైస్ ప్రిన్సిపల్ వై లక్ష్మి, స్వీప్ టీం అధికారులు పుష్పరాజం, పోలినాయుడు, విశాఖ వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు బాలకృష్ణ, విద్యార్థులు, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

ఓటు సద్వినియోగంతో ప్రజాస్వామ్య పరిరక్షణ

ఆకాశవాణి ద్వారా ఓటర్లకు సందేశమిచ్చిన జిల్లా కలెక్టర్ మల్లికార్జున

ప్రజాశక్తి -ఎంవిపి కాలని : వచ్చేనెల 13న జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో రాజ్యాంగం కల్పించిన వజ్రాయుధం లాంటి ఓటు హక్కును ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవడం ద్వారా ప్రజాస్వామ్య పరిరక్షణను ప్రథమ కర్తవ్యంగా నిర్వర్తించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున సూచించారు.. ఓటరు చైతన్యం, ఓటు ప్రాముఖ్యత, వినియోగం, హోం ఓటింగ్ విధానం, పోలింగ్ స్టేషన్ల వద్ద కల్పించిన వసతులు, ఎన్నికల నియమావళి అమలు తదితర అంశాలపై సిరిపురంలోని ఆల్ ఇండియా రేడియో ద్వారా జిల్లా కలెక్టర్ ఓటర్లకు సందేశమిచ్చారు. తొలిసారిగా ఓటు హక్కు పొందిన యువత జిల్లాలో సుమారు 60వేల మంది ఉన్నారని,. వారంతా ఉత్సాహంగా తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. జిల్లాలోని 1991 పోలింగ్ స్టేషన్లు ఉన్నాయన్నారు. వయోవృద్ధులు, వికలాంగులకు పోలింగ్ కేంద్రాల్లో పత్యేక వసతులు, క్యూ లైన్లు ఏర్పాటు చేస్తామన్నారు. వికలాంగులకు ఒకరి సాయంతో రావొచ్చన్నారు. ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం 85 ఏళ్ళు దాటిన వృద్ధులకు, 40 శాతం వైకల్యం దాటిన వికలాంగులకు ఇంటి వద్ద నుంచే ఓటు వేసుకునేలా హోం ఓటింగ్‌విధానం అందుబాటులో ఉందన్నారు. దీనికి ఇప్పటివరకు 1500 పైచిలుకు దరఖాస్తులొచ్చాయని, వాటిని పరిశీలించి తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు..

ఆకాశవాణిలో మాట్లాడుతున్న విశాఖ కలెక్టర్ మల్లికార్జున

వేసవిని దష్టిలో పెట్టుకొని పోలింగ్ కేంద్రాల వద్ద షామియానాలు, తాగునీరు, వైద్య సిబ్బంది అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నామన్నారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘనపై జిల్లాలో ఇప్పటివరకు 58 ఘటనల్లో ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశామని. 68 మంది ఉద్యోగులపై చర్యలు తీసుకున్నామన్నారు. ఎన్నికల కోడ్ అమలుకు 110 రకాల బృందాలను నియమించాం. వస్తు, ధన రూపంలో రూ.5.03 కోట్ల వరకు జప్తు చేశామన్నారు.

పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వినియోగించుకునే ఏర్పాట్లు చేశామని, ఫారం 12డిని సేకరిస్తున్నామన్నారు. వచ్చేనెల 5,6,7,8 తేదీల్లో ఫెసిలిటేషన్ కేంద్రాల్లో స్థానిక ఉద్యోగులు, బయట ప్రాంతాల నుంచి వచ్చి ఇక్కడ సేవలందిస్తున్న ఉద్యోగులు తమ ఓటు హక్కును వినియోగించు కోవచ్చని కలెక్టర్ సూచించారు. ఓటరు గుర్తింపు కార్డు లేకున్నా, కేంద్రం ఎన్నికల సంఘం సూచించిన 12 రకాల కార్డులను చూపించి ఓటు వేయొచ్చని స్పష్టం చేశారు. గత ఎన్నికల్లో 67 శాతం పోలింగ్ నమోదైందని, ప్రస్తుత ఎన్నికల్లో 80 శాతానికి మించి ఓటింగ్ జరిగేందుకు ఓటర్లందరూ ముందుకు రావాలన్నారు. ఆకాశవాణి టాక్ షోలో డిపిఆర్ఒ ఎస్వి. రమణ, డివిజనల్ పిఆర్ఒ డి. నారాయణరావు, ఆల్ ఇండియా రేడియో ప్రోగ్రాం హెడ్ పివి.రాంగోపాల్, ప్రోగ్రాం ఎగ్జిక్యూటివ్ ఎన్.సుధాకర్ రెడ్డి, డ్యూటీ అధికారి సాంబశివరావు పాల్గొన్నారు.

పలువురు నామినేషన్లు దాఖలు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్, అనకాపల్లి విలేకరులు : విశాఖ పార్లమెంటు స్థానానికి ఆరో రోజు మంగళవారం మూడు నామినేషన్లు దాఖలయ్యాయి. నవతరం పార్టీ నుంచి గండికోట రాజేశ్, కాంగ్రెస్ నుంచి పులుసు సత్యనారాయణరెడ్డి, స్వతంత్ర అభ్యర్థిగా మల్ల శ్రావణి తమ నామినేషన్లను రిటర్నింగ్ అధికారి జిల్లా కలెక్టర్ మల్లికార్జునకు అందజేశారు. ప్రజాశాంతి పార్టీ అభ్యర్థి కెఎ.పాల్ రెండోసెట్ నామినేషన్ పత్రాలను అందజేశారు. డిఆర్ఒ కె.మోహన్‌కుమార్ పాల్గొన్నారు. అనకాపల్లి పార్లమెంట్ స్థానానికి పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా తరపున కర్రి విజయలక్ష్మి నామినేషన్ దాఖలు చేశారు

విశాఖ జిల్లాలోని ఏడు అసెంబ్లీ స్థానాలకు మంగళవారం 18మంది అభ్యర్థులు 23 నామినేషన్లను దాఖలు చేశారు. భీమిలి అసెంబ్లీ స్థానానికి స్వతంత్ర అభ్యర్థులుగా చొప్పల్లి శరవణ్ గణేష్, బావిశెట్టి రమణబాబు, విశాఖ తూర్పు నియోజకవర్గం నుంచి స్వతంత్ర అభ్యర్థులుగా శివరామకష్ణ అనగాని, డాక్టర్ మాతే సురేష్ నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారులు భాస్కరరెడ్డి, కె.మయూర్ అశోక్‌లకు సమర్పించారు. విశాఖదక్షిణ నియోజకవర్గం వైసిపి అభ్యర్థిగా జె.బిపిన్ కుమార్‌జైన్,కాంగ్రెస్ అభ్యర్థిగా వాసుపల్లి సంతోష్‌కుమార్, ఉత్తర నియోజకవర్గం బిజెపి తరపున పెనుమత్స విష్ణుకుమార్‌రాజు, పెనుమత్స శ్యామలా దీపిక, కాంగ్రెస్ తరపున వి.వి.యస్.కమలాకరరావు, రామారావు లక్కరాజు, బిఎస్‌పి తరపున పెద్దాడ కనక మహాలక్ష్మీ నామినేషన్లను వేశారు. పశ్చిమంలో ఎస్‌పి అభ్యర్థిగా రవికుమార్ వెలగాడ, బిఎస్‌పి తరపున అతుకుంశెట్టి రామచంద్రరావు, స్వతంత్ర అభ్యర్థిగా మండపాటి శ్రీనివాసరాజు నామినేషన్లను దాఖలు చేశారు. గాజువాక సిపిఎం నుంచి మైలవరపు రాంబాబు, స్వతంత్ర అభ్యర్థిగా సీమకుర్తి శ్రీనివాసరావు, పెందుర్తి స్థానంలో కాంగ్రెస్ అభ్యర్థి పిరిడి భగత్, స్వతంత్ర అభ్యర్థిగా పొన్నాడ అప్పలనాయుడు నామినేషన్ వేశారు.

తూర్పు ఎమ్మెల్యే అభ్యర్థిగా నామినేషన్ వేస్తున్న మాతే సురేష్

అనకాపల్లి జిల్లాలో. ఆరు అసెంబ్లీ స్థానాలకు 14 మంది నామినేషన్లు దాఖలయ్యాయి. చోడవరం కాంగ్రెస్ అభ్యర్థిగా జగత శ్రీనివాసరావు, మాడుగుల టిడిపి అభ్యర్థిగా బండారు సత్యనారాయణ మూర్తి, అనకాపల్లి అసెంబ్లీకి జైభారత్ నేషనల్ పార్టీ తరపున కనిశెట్టి సురేష్‌బాబు, కాంగ్రెస్ తరపున ఇల్ల రామ గంగాధరరావు, అవినాష్ ఇల్ల, పిరమిడ్ పార్టీ తరపున పొలమరశెట్టి అంబికాదేవి, ఇండిపెండెంటుగా వి.వి.రామచంద్రరావు నామినేషన్లు దాఖలు చేశారు. ఎలమంచిలిలో జనసేన తరపున రవికుమార్ సుందరపు, కాంగ్రెస్ తరపున తనకాల అనంత రామ నర్సింగరావు, పాయకరావుపేటలో టిడిపి అభ్యర్థిగా వంగలపూడి అనిత, ఇండిపెండెంటుగా యేసయ్య బూరి, నర్సీపట్నంలో వైసిపి తరపున ఉమాశంకర్ గణేష్, కళావతి పెట్ల, ఇండిపెండెంట్‌గా బయపురెడ్డి భద్రాచలం నామినేషన్లు దాఖలు చేశారు.

చెన్నయ్ ఎగ్మోర్, హతియాకు వేసవి ప్రత్యేక రైళ్లు

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ :ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని, ఈస్ట్‌కోస్ట్ రైల్వే విశాఖపట్నం-చెన్నై ఎగ్మోర్, విశాఖపట్నం-హతియా మధ్య ప్రత్యేక రైళ్లను నడపాలని నిర్ణయించింది. 08557 విశాఖపట్నం-చెన్నై ఎగ్మోర్ వేసవి ప్రత్యేక రైలు ఈనెల 27 నుండి వచ్చేనెల 29 వరకు ప్రతి శనివారం సాయంత్రం ఏడు గంటలకు విశాఖపట్నంలో బయలుదేరి మరుసటి రోజు ఉదయం 8.45 గంటలకు చెన్నై ఎగ్మోర్ చేరుకుంటుంది. 08558 చెన్నై ఎగ్మోర్, విశాఖపట్నం వేసవి ప్రత్యేక రైలు ఈనెల 28 నుండి వచ్చేనెల 30 వరకు ప్రతి ఆదివారం ఉదయం 10.30 గంటలకు చెన్నై ఎగ్మోర్ నుంచి బయలుదేరి అదేరోజు రాత్రి 22.35 గంటలకు విశాఖపట్నం చేరుకుంటుంది. విశాఖ, చెన్నయ్ ఎగ్మోర్ మధ్య పది ట్రిప్పులు నడిచే ఈ రైళ్లుదువ్వాడ, అనకాపల్లి, ఎలమంచిలి, తుని, సామర్లకోట, రాజమండ్రి, ఏలూరు, విజయవాడ, ఒంగోలు, నెల్లూరు గూడూరు మీదుగా ప్రయాణిస్తాయి.

08555 విశాఖపట్నం, హతియా వేసవి ప్రత్యేక రైలు ఈనెల 28 నుండి వచ్చేనెల 30 వరకు ప్రతి ఆదివారం రాత్రి 23.50 గంటలకు విశాఖపట్నం నుండి బయలుదేరి మరుసటి రోజు మధ్యాహ్నం 14.35 గంటలకు హటియా చేరుకుంటుంది. 08556 హటియా,విశాఖపట్నం వేసవి ప్రత్యేక రైలు ఈనెల 29 నుండి జూన్ ఒకటో తేదీ వరకు ప్రతి సోమవారం సాయంత్రం నాలుగు గంటలకు హటియాలో బయలుదేరి మరుసటి రోజు ఉదయం 9.50 గంటలకు విశాఖపట్నం చేరుకుంటుంది. ఈ రైళ్లు విజయనగరం, బొబ్బిలి, పార్వతీపురం, రాయగడ, మునిగూడ, కేసింగ, టిట్లాగఢ్, బలంగీర్, బర్గర్, సంబల్‌పూర్, ఝర్సుగూడ రూర్కెలా మీదుగా ప్రయాణిస్తాయి.

పలు రైళ్ల రద్దు/ దారి మళ్లింపు

దక్షిణ మధ్య రైల్వేలోని విజయవాడ డివిజన్‌లో భద్రతా పనుల దృష్ట్యా 17243 గుంటూరు-రాయగడ ఎక్స్‌ప్రెస్, 17267 కాకినాడ-విశాఖపట్నం ఎక్స్‌ప్రెస్, 17268 విశాఖపట్నం-కాకినాడ ఎక్స్‌ప్రెస్ లను ఈనెల 29 నుండి వచ్చేనెల 26 వరకు, 17244 రాయగడ-గుంటూరు ఎక్స్‌ప్రెస్ ఈనెల 30 నుండి వచ్చేనెల 27 వరకు రద్దు చేసారు.

పలు రైళ్ల దారి మళ్లింపు

దక్షిణ మధ్య రైల్వేలోని విజయవాడ డివిజన్‌లో భద్రతా పనుల కారణంగా 22643 ఎర్నాకులం-పాట్నా సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ ఈనెల 29 వచ్చేనెల 6, 13, 20 తేదీలలో, 12509 ఎస్ఎంవి బెంగళూరు-గౌహతి సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ వచ్చేనెల 1, 3 , 8, 10, 17, 22, 24 తేదీలలోనూ, 11019 సిఎస్‌టి ముంబై-భువనేశ్వర్ కోణార్క్ ఎక్స్‌ప్రెస్ ఈనెల 29, మే 1, 3, 4, 6, 8, 10, 11, 13, 15, 17, 18, 20, 22, 24, 25 తేదీల్లో సాదారణ మార్గమైన విజయవాడ- ఏలూరు- నిడదవోలు మీదుగా కాకుండా విజయవాడ- గుడివాడ- భీమవరం టౌన్- నిడదవోలు మీదుగా మళ్లించబడిన మార్గంలో నడుస్తాయి. అదేవిధంగా 18111 టాటా-యశ్వంత్‌పూర్ ఎక్స్‌ప్రెస్ టాటాలో వచ్చేనెల 2, 9, 16 23 తేదీలలో, 12376 జసిదిహ్-తాంబరం ఎక్స్‌ప్రెస్ వచ్చేనెల 1, 8, 15,22, తేదిలలో 22837 హటియా-ఎర్నాకులం ఏసీ ఎక్స్‌ప్రెస్ ఈనెల 29, వచ్చేనెల 6 , 13, 20 తేదీలలో, 18637 హటియా-ఎస్ఎంవి బెంగళూరు ఎక్స్‌ప్రెస్ ఈనెల 30, వచ్చేనెల 5, 7, 12, 14, 19, 21 26 తేదీలలో, 12889 టాటా నగర్- ఎస్ఎంవి బెంగళూరు ఎక్స్‌ప్రెస్ వచ్చేనెల 3, 10, 17, తేదీలలో , 13351 ధన్‌బాద్-అలెప్పి బొకారో ఎక్స్‌ప్రెస్ ఈనెల 29 నుండి వచ్చేనెల 26 వరకు సాధారణ మార్గం అయిన నిడదవోలు-ఏలూరు-విజయవాడ మీదుగా కాకుండా మళ్లించిననిడదవోలు-భీమవరం టౌన్-గుడివాడ-విజయవాడ మీదుగా దారి మళ్లించిన మార్గంలో నడుస్తాయని ఈస్ట్‌కోస్టు రైల్వే అధికారులు వెల్లడించారు..

26న రంగసాయి నాటక గ్రంథాలయ వార్షికోత్సవం

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : దేశ నాటక రంగ చరిత్రలో మొట్టమొదటి నాటక గ్రంథాలయంగా అందరికీ సుపరిచితమైన విశాఖపట్నం రంగసాయి నాటక గ్రంథాలయం 12వ వార్షికోత్సవాన్ని నగరంలోని టిఎస్ఆర్ కాంప్లెక్స్‌లోని రంగసాయి నాటక గ్రంథాలయంలో ఈనెల 26న శుక్రవారం సాయంత్రం 6 గంటలకు నిర్వహించనున్నట్లు సంస్థ వ్యవస్థాపకుడు బాదంగీర్ సాయి తెలిపారు. ఈ సందర్భంగా విశాఖలోనిరంగస్థల కళాకారులకు ఆత్మీయ సత్కారాలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయన్నారు. కార్యక్రమ రథసారథిగా సీనియర్ జర్నలిస్టు నాగనబోయిన నాగేశ్వరరావు వ్యవహరిస్తారన్నారు.